17122024-MAI-04_Layout 1 12/17/2024 4:38 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# ఇంకెన్నాళ్లు రైతుల నిర్బంధం?

**చట్టం** ముందు అందరూ సమానమే. ఈ సంగతి ఎన్నో న్యాయ పోరాటాల్లో నిగ్గుదేలిన సంగతి తెలిసిందే. కానీ, సమానత్వం అనేది చట్టానికి భాష్యం చెప్పే తీర్పరి వ్యవస్థ మీద కొంత, దానిని ప్రభావితం చేసే ప్రభుత్వ వ్యవస్థల మీద కొంత ఆధారపడి ఉంటుంది. ఆ రెండింటి ప్రభావంతో కొన్నిసార్లు హెచ్చుతగ్గులు కనిపిస్తుంటాయి. ముఖ్యంగా బెయిలు విషయంలో ఇది ప్రస్ఫుటంగా కనిపిస్తుంటుంది. నెలరోజులకు పైగా జైలులో మగ్గుతున్న లగచర్ల రైతుల విషయంలో ఈ వ్యత్యాసం మరోసారి మన ముందుకువచ్చింది. సర్కారు వెన్నుపోటు పొడిచిందనే ఆగ్రహంతో తిరగబడ్డందుకు నెల రోజులకు పైగా 24 మంది రైతులు కటకటాల వెనుక బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న సంగతి తెలిసిందే. మొన్నకు మొన్న ఓ రైతు ఖైదీకి గుండెజబ్బు వస్తే పశువులను సంతకు తోలినట్టు సంకెళ్లు వేసి దవాఖానకు తరలించిన దృశ్యం మనం మరచిపోలేం. నిర్బంధంలో వారు ఎదుర్కొంటున్న దుర్భర స్థితిని అది కండ్లకు కట్టింది. రైతులు తమ వద్దకు వచ్చిన అధికారులపై కోపం చూపారు. కానీ, అసలు సిసలు కారకులైన ప్రభుత్వ పెద్దలు మాత్రం తమ ఎజండాను తెరవెనుక నుంచి నడిపిస్తూనే ఉన్నారు. దాడి వల్ల సమస్య తీరకపోగా కేసులు మెడకు చుట్టుకొని రైతుల బతుకు నరకమైపోయింది. రైతుల కుటుంబాల పరిస్థితి ఎక్కే మెట్లు, దిగే మెట్లు అన్నట్టుగా తయారైంది.

బెయిలు ఇవ్వడం తప్పనిసరి, జైలుకు పంపడం అనేది మినహాయింపుగా ఉండాలని సుప్రీంకోర్టు పదే పదే చెప్తున్నది. ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కేసులోనూ, ప్రొఫెసర్ సాయిబాబా కేసులోనూ ఇదే సంగతిని పునరుల్లేఖించింది. ఈ లగచర్ల రైతుల బెయిలు కోసం ఎంతగా ప్రయత్నిస్తున్నా లభించడం లేదు. ప్రముఖులు ఇలా వెళ్లి అలా తిరిగివస్తారు. కానీ, అమాయకులైన అన్నదాతలు మాత్రం దిక్కులేని పక్షుల్లా జైలు గోడల వెనుక దిగులుగా గడుపుతున్నారు. పలుకుబడి కలిగిన వ్యక్తులకు బెయిలు ఇవ్వడంపై ఎవరికీ అభ్యంతరం ఉండదు. లగచర్ల రైతులకు ఎందుకివ్వడం లేదు అనేదే ప్రశ్న.


రైతులు కేసును తారుమారు చేస్తారా? నీరవ్ మోదీలా, విజయ్ మాల్యాలా దేశం విడిచి పారిపోతారా? ఊరు దాటితే ఒడ్డున పడ్డ చేపలే కదా.. పోలీస్ స్టేషన్లో, కోర్టులో ధాటిగా మాట్లాడనైనా మాట్లాడలేరు. రేపు న్యాయస్థానం విచారణ జరిపి ఏ శిక్ష వేసినా ఎవరూ కాదనలేరు. దేనికైనా ముందు చార్జిషీటు దాఖలు కావాలి. కానీ, ప్రభుత్వం కుంటిసాకులతో సాగదీత ధోరణి అనుసరిస్తున్నది. బలమైన ఆధారాలుంటే చార్జిషీటు ఎందుకు దాఖలు చేయరనే వాదనలూ వినిపిస్తున్నాయి. తన అభీష్టాన్ని ప్రశ్నించి, ప్రతిఘటించినందుకు వీలైనన్ని రోజులు రైతులను జైల్లోనే మగ్గబెట్టాలనే మంకుపట్టుతో ప్రభుత్వం వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తున్నది. ఇది ఏ మాత్రం క్షమార్హం కాదు. సామాజిక మాధ్యమాల్లోనూ దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. అంతా సమానమే కానీ, కొంతమంది కొంచెం ఎక్కువ సమానమన్న వ్యంగ్యోక్తికి అద్దం పట్టేలా తయారైంది లగచర్ల రైతుల కేసు. సర్కారు ఇప్పటికైనా తన మొండి వైఖరి మార్చుకొని బెయిలుకు మోకాలడ్డు పెట్టడం మానుకోవాలి. తాను వ్యవహరిస్తున్నది సామాన్యులైన రైతులతోనని సోయి తెచ్చుకుంటే మంచిది.

# మేధావుల గొంతులో ఆర్బీఐ వెలక్కాయ

**తెలంగాణలో మేధావులు అనబడేవారు ఏ విషయం గురించి ఏమంటారా అని సమాజం ఎదురుచూస్తుంటుంది. ఆ విధంగా, 2014-15 నుంచి 2023-24 మధ్య పదేండ్ల కాలంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి విషయమై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తన హ్యాండ్‌బుక్‌లో కొద్దిరోజుల క్రితం పేర్కొన్న వివరాల గురించి వారు ఏమంటారోనని కూడా సమాజం ఆసక్తిగా ఎదురుచూస్తూనే ఉండి ఉంటుంది. కానీ, కనీసం ఇంతవరకైతే వారి నుంచి ఎటువంటి వ్యాఖ్యానాలు వినిపించలేదు. హ్యాండ్‌బుక్ చెప్పిన లెక్కలను ఇంకా పరిశీలిస్తున్నారో, లేక వారి మౌనానికి మరేదైనా కారణం ఉందో తెలియదు.**



**టంకశాల అశోక్**




రిజర్వ్ బ్యాంక్ నివేదికపై మేధావుల అభిప్రాయాలను సమాజం తెలుసుకోవాలనుకోవటానికి సాధారణమైన ఆసక్తి మాత్రమే గాక ఒక ప్రత్యేక కారణం ఉన్నది. పైన పేర్కొన్న పదేండ్ల కాలంలో పాలించిన బీఆర్‌ఎస్ కాలంలో చాలా అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ చెప్తుండగా, జరిగిందంతా సర్వనాశనం, ఆర్థిక విధ్వంసం, అంతా అప్పుల కుప్ప, యాభై ఏండ్లు వెనుకకుపోవటమని కాంగ్రెస్ విమర్శిస్తూ వస్తున్నది. ప్రజల స్వానుభావాలు ఏమిటన్నది అట్లుంచితే, ఇటువంటి పరస్పర విరుద్ధ ప్రచారాలు వారిలో కొందరికి అయోమయాన్ని సృష్టించాయి. అట్లాంటి పరిస్థితి తలెత్తినప్పుడు, తటస్థులుగా, సమాజం పక్షాన నిలిచేవారిగా, స్వతంత్ర పరిశీలనలు చేసి ప్రజలకు వాస్తవాలను తెలియజేసే బాధ్యత మేధావులు అనబడే వారిపై ఉంటుంది. తమ నుంచి సమాజం ఆశించేది అదే. ఆ పని చేయనప్పుడు వారి ఉనికికే అర్థం ఉండదు. లేదా వారు కపటపు మేధావులనే పేరు తెచ్చుకుంటారు.

కనుక, మేధావి బృందాలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుంటూ, రిజర్వ్ బ్యాంక్ నివేదికపై రాగల రోజులలోనైనా తమ ఆలోచనలను వెల్లడించగలరని ప్రజలు ఆశిస్తారు. అయితే, గత పదేండ్లుగా వారి రికార్డులను గమనించినప్పుడు మాత్రం అటువంటి ఆశాభావం అంతగా కలగటం లేదు. ఈ మాట అనేందుకు కొన్ని కారణాలున్నాయి. మొదటిది, బ్యాంక్ వారు పదేండ్ల లెక్కలన్నింటిని క్రోడీకరించి హ్యాండ్‌బుక్ రూపంలో ఇప్పుడు ప్రకటించి ఉండవచ్చు. కానీ, ఆ వివరాలు ఇప్పుడు అకస్మాత్తుగా వెలుగులోకి వచ్చినవి కావు. జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాలు ఆ కాలమంతా ఎప్పటికప్పుడు కండ్ల ఎదుట కనిపిస్తుండినవే. అప్పటి ప్రభుత్వం ప్రకటిస్తూ వచ్చినవే. అదిగాక, ఆర్బీఐ తరహాలోనే కేంద్ర ఆర్థిక శాఖ, ఇతర కేంద్ర మంత్రిత్వ శాఖలు, నీతి ఆయోగ్, పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలు, ప్రైవేట్ వ్యాపారసంస్థల సంఘాలు, వాటి ప్రముఖులు చెప్తూ వచ్చినవే. ఈ సమస్తం కూడా నిజం కాదని ఒకవేళ మేధావులు భావించి ఉంటే తమ వైపు నుంచి స్వతంత్ర పరిశీలనలు చేసి వాస్తవాలేమిటో ప్రజల ముందు ఉంచవచ్చు. వారికి ఒకవైపు పబ్లిక్ డొమైన్‌లో డేటా కుప్పలుతెప్పలుగా ఉంది. మరొకవైపు క్షేత్రస్థాయి పరిశీలనలకు గ్రామాలు, పట్టణాలు ఎదురుగా ఉన్నాయి. కానీ, వారు అటువంటివేమీ ఎప్పుడూ చేయలేదు.

మేధావుల రికార్డు అంటున్నవాటిలో ఇది ఒక అంశం కాగా, వారు మరొక అడుగు ముందుకు వెళ్లి కాంగ్రెస్ ఏమి చెప్తే అది తలపై మోసుకుంటూ అప్పటి ప్రభుత్వంపై నానా ప్రచారాలన్నీ చేశారు. సంక్షేమం అరకొర అన్నారు, అభివృద్ధి శూన్యమన్నారు అప్పులు భయంకరంగా పెరిగాయన్నారు. కొందరు మహాశయులైతే, పరిస్థితి ఇంతకన్న ఉమ్మడి రాష్ట్రంలో బాగుండేదని, తెలంగాణ రాకపోయినా బాగుండేదేమోనని అనేంతవరకు వెళ్లారు. ఇటువంటి గ్యాంగ్‌లో ఎవరెవరున్నారో అందరికీ తెలిసిందే గనుక ఆ పేర్లు ఇక్కడ రాయటం లేదు. మొత్తానికి ఇది రెండవ అంశం కాగా, ఈ బృందం మేధావులు గత ఎన్నికల్లో ఏకంగా కాంగ్రెస్ ప్రచార రథాలకు జెండాలూపే స్థాయికి పతనమయ్యారు. తమ తీరును తమ హక్కుల వేదికలకే చెందిన ఇతర ప్రముఖులు, సభ్యులు వ్యతిరేకించినా వెనక్కి తగ్గలేదు. ఇది మూడవ అంశం.

> **వంద రోజుల గడువు హామీల గురించి ఆ తర్వాత కొన్ని నెలలు గడిచిన మీదట ఈ బృందంలోని ఒక ప్రముఖుడిని ఒక పాత్రికేయుడు ప్రశ్నించగా, తలదించుకుని నీళ్లు నములుతూ, వినిపించీ వినిపించని స్వరంతో, ఆర్థిక ఇబ్బందుల గురించి, గత ప్రభుత్వం మిగిల్చిన అప్పుల భారం గురించి మాట్లాడారు. అమలు చేయలేకపోవటానికి తన మేధావితనంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి సాకులు వెతికిపెట్టబూనారు.**

చివరిదైన నాల్గవ అంశం, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంగా వారు తీసుకుంటూ వస్తున్న వైఖరి ఏమిటన్నది. వందరోజుల గడువుతో బాండ్ పేపర్లపై సంతకాలు చేసి ఇంటింటికీ తిరిగి పంచిన హామీల అమలు విషయంలో గాని, ఈ సరికి ఏడాది కాలం కూడా పూర్తయిన పరిస్థితిలో గాని, ఈ మధ్య కాలంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులు, పింఛన్లు, విద్య, వైద్యరంగాలు, సంక్షేమ హాస్టళ్లు, మానవహక్కులు, హైడ్రా, గిరిజనుల భూములు, ఛప్పన్నారు ఇతర హామీలు, నిరంతరం అసత్యపు మాటలు, బుకాయింపుల వంటి విషయాలలో గాని వీరు అసలేమైనా మాట్లాడారా? మాట్లాడితే ఏమిటన్నది ప్రశ్న. వీటన్నింటిలో రెండే రెండు మాత్రం చూద్దాం. వంద రోజుల గడువు హామీల గురించి ఆ తర్వాత కొన్ని నెలలు గడిచిన మీదట ఈ బృందంలోని ఒక ప్రముఖుడిని ఒక పాత్రికేయుడు ప్రశ్నించగా, తలదించుకుని నీళ్లు నములుతూ, వినిపించీ వినిపించని స్వరంతో, ఆర్థిక ఇబ్బందుల గురించి, గత ప్రభుత్వం మిగిల్చిన అప్పుల భారం గురించి మాట్లాడారు. అమలు చేయలేకపోవటానికి తన మేధావితనంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి సాకులు వెతికిపెట్టబూనారు. ఇక్కడ రెండు ప్రశ్నలు తలెత్తుతాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాళా తీసిందంటూ ఎన్నికల సమయంలో హోరెత్తించిన ప్రస్తుత పాలకులకు వారి మద్దతుదారులైన ఈ మేధావులకు, వాటి అమలుకు నిధులు కష్టమని అప్పుడు తెలియలేదా? పోతే, అప్పుల భారమన్న ప్రచారమే అబద్ధమని ఇప్పుడు ఆర్బీఐ రిపోర్టుతో తేలుతున్నప్పుడు, ఏలినవారు దిక్కులు చూస్తుండవచ్చుగాని ఈ ఘనమైన మేధావులు ఏమంటారు? ఇక రెండవది నిరుద్యోగుల సమస్య. జరుగుతున్నదానిని అదే మేధావితో ప్రస్తావించగా అదేవిధంగా నేల చూపులు చూస్తూ, ఇది ప్రమాదకరంగా ఉంది, ఏమవుతుందోనని నసుగుతారు. మరొక మేధావి, ఏమి జరుగుతుందో చూసి వచ్చే ఎన్నికల సమయంలో మాట్లాడతామంటారు! ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు అసాధ్యమని వారికి ముందు తెలియదా?

> **నిజాయితీ లేని వారిని అసలు మేధావులు అనవచ్చునా అనే మౌలికమైన సందేహాలు అట్లుంచితే, ప్రస్తుతం తెలంగాణ సమాజం ఎదుట గల రిజర్వ్ బ్యాంక్ హ్యాండ్ బుక్ గణాంకాల గురించి ఈ మేధావి గణాలు ఏమనేదీ వినాలని ఎంతో ఉత్సుకతగా ఉంది. అవి వారి గొంతులో పచ్చి వెలక్కాయ వలె మింగలేని, కక్కలేని విధంగా ఇరుక్కుని ఉన్నాయా? లేక , ఆ లెక్కలన్నీ తప్పంటూ తమ ప్రియమైన పార్టీని, ప్రభుత్వాన్ని ఏ విధంగా సమర్థించాలా అని మేధోమథనాలు చేస్తున్నారా? లేక కనీసం ఇప్పటికైనా నిజాయితీపరులుగా పరివర్తన చెంది తెలంగాణ ప్రజలకు నిజాలను చెప్తూ, తమ ఇంతకాలపు నిజాయితీరాహిత్యానికి క్షమాపణలు ప్రకటిస్తారా?**

ఆర్బీఐ నిర్ధారించిన వివరాలనేకం ఇదే పత్రికలో ఈ శని, ఆది, సోమవారాలలో వెలువడినవే అయినందున, అవి ఇక్కడ మళ్లీ రాయవలసిన అవసరం ఉందని భావించటం లేదు. అయినప్పటికీ కొండగుర్తుల వలె రెండు మాటలు చెప్పుకోవాలంటే, ఏడు లక్షల కోట్ల అప్పులనేవి తప్పు లెక్క, అది మూడు లక్షల చిల్లర మాత్రమేనన్న వాస్తవంతో సహా అనేక విషయాలు, ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వపు సోకాల్డ్ శ్వేతపత్రంపై అసెంబ్లీ చర్చ సందర్భంగా మాజీ ఆర్థికమంత్రి హరీశ్‌రావు వెల్లడించినవే. అట్లా వివిధ రంగాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వాన సాధించిన అభివృద్ధి లెక్కలన్నింటికి కూడా బీరుపోని తీరులో ఇప్పుడు రిజర్వ్ బ్యాంక్ తన ఆమోద ముద్రను వేసిందన్నది ఈ మేధావులు తమ రెండు కళ్లూ తెరుచుకొని చూస్తారా? ■

# ఊరించి.. ఉద్యోగులను మోసం చేసి..

*కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో ఉపాధ్యాయ, ఉద్యోగులకు 'చూపుల కన్నా ఎదురుచూపులు మిన్న' అనే పాట సరిగ్గా సరిపోతుంది. ఆ పార్టీ అధికారంలోకి రావడానికన్నా ముందు అన్నివర్గాలకు అలవిగాని హామీలు ఇచ్చినట్టుగానే వీరికి కూడా ఎన్నో హామీలిచ్చింది. కానీ, ఏడాది దాటినా ఆ హామీలు అమలుకావడం లేదు. మచ్చుకు ఒక్క ఉదాహరణను తీసుకుంటే అధికారంలోకి రాగానే పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలు విడుదల చేస్తామని చెప్పిన ఆ పార్టీ నాయకులు, ఒక విడుత కరువు భత్యం మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. మిగతా నాలుగింటి సంగతి ఇక దేవుడే ఎరుగు.*

*గత కేసీఆర్ ప్రభుత్వం దేశంలోనే మొదటిసారిగా పీఆర్సీ ఏర్పాటుతో పాటు 5 శాతం ఇంటరిమ్ రిలీఫ్ ప్రకటించి అమలుచేసింది. ఆరు నెలల్లో పీఆర్సీని అమలుచేస్తామని చెప్పిన కాంగ్రెస్ మాత్రం గడువును పెంచుతూ పోతున్నది. గత కేసీఆర్ ప్రభుత్వం రెండు సార్లు పీఆర్సీ కమిషన్ సిఫారసులకు ఆమోదం తెలిపి 73 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చింది. దీంతో ఉద్యోగుల వేతనాల్లో గణనీయమైన మార్పు వచ్చింది. జీతం పెరుగుదల విషయంలో దేశంలోనే తెలంగాణ ఉద్యోగులు ముందువరుసలో నిలిచారు.*



**గుండవరం దేవిప్రసాద్ రావు**
90006 33404




**2023**, జూలై 1 నుంచి కొత్త పీఆర్సీ అమలు కావాలి. కానీ, ఇప్పటికీ అతీగతీ లేదు. ఎప్పుడిస్తారో కూడా తెలియదు. అంతేకాదు, ఈ నాలుగేండ్లలో అమలవుతుందో, లేదోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. పీఆర్సీ మాట దేవుడెరుగు, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు ఇచ్చినా చాలనే స్థితిలో ఉద్యోగులున్నారు.

2004 తర్వాత నియామకమైన ఉద్యోగులకు కాంట్రిబ్యూషన్ పింఛన్ స్కీంను అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని, లేకపోతే కేంద్రం నుంచి రావాల్సిన నిధుల్లో రాష్ట్రాలకు కోత విధిస్తామని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. అన్ని రాష్ట్రాలు అమలు చేసే విధంగా ఒత్తిడి చేసింది. సీపీఎం పార్టీ అధికారంలో ఉన్న అప్పటి పశ్చిమబెంగాల్, త్రిపుర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వ బెదిరింపులకు లొంగకుండా పాత పింఛన్ విధానాన్నే అమలుచేశాయి. ఇటీవలి కాలంలో త్రిపురలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీపీఎస్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. రేవంత్‌రెడ్డి కూడా అధికారంలోకి రాగానే తెలంగాణలో సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి ఏడాది తర్వాత కూడా ఒక్కడుగు ముందుకు వేయలేదు. ఇతర రాష్ట్రాలలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ గతంలో అధికారంలోకి రాగానే, ఉద్యోగులను మోసం చేస్తూ కుంటి సాకులతో కేంద్రంపైకి నెడుతూ తప్పించుకున్నది.

జాతీయ పింఛన్ విధానంలో ఉద్యోగులు చెల్లించిన 10 శాతం తిరిగి రాష్ట్రాలకు జమచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా కేంద్రం ఇచ్చేదే లేదని తేల్చిచెప్పింది. దీన్ని సాకుగా చూపించి అన్ని రాష్ట్రాలు సీపీఎస్‌ను కొనసాగిస్తున్నాయి. సీపీఎస్ అమలులో కాంగ్రెస్, బీజేపీలు దొందూ దొందే అనేవిధంగా వ్యవహరిస్తున్నాయి. కాంగ్రెస్ యూపీఏ హయాంలో సీపీఎస్ పురుడు పోసుకున్నది. భాగస్వామ్యంగా ఉన్న వామపక్ష పార్టీలు వ్యతిరేకంగా ఉండటం వల్ల వెనకడుగు వేసింది. కానీ, ఎన్డీయే అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ విధానాలను సమర్థవంతంగా అమలుచేసింది. బీజేపీ ప్రభుత్వం 4/25 నుంచి అమలుచేయనున్న ఏకీకృత పింఛన్ పథకాన్ని ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఉద్యోగి కుటుంబానికి సామాజిక భద్రత ఇవ్వని యూపీఎస్ మాకు వద్దని ఉద్యమాలు చేస్తున్నారు. పైగా, ఉద్యోగులు ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని కేంద్రం అనుమతివ్వడం వల్ల ప్రభుత్వ కార్యాలయాల్లో ఘర్షణలు జరిగే అవకాశం ఉన్నది. ఉద్యోగుల పనితీరును ప్రతి నెల సమీక్షించి అవసరమైతే నిర్బంధ పదవీ విరమణ చేస్తామంటూ ఉత్తర్వులు ఇచ్చారు.

కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవడాన్ని ఉద్యోగులు గమనిస్తున్నారు. జీవో నంబర్ 317ను సమీక్షించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేసింది. 10 నెలల తర్వాత ఆ నివేదిక మేరకు జీవో 243, 244, 245 విడుదల చేసింది. కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు ఉద్యోగులు స్థానికత విషయం ప్రస్తావన లేకుండా కేవలం స్పౌజ్, అనారోగ్య కారణాలతో బదిలీలకు అవకాశం కల్పించారు. ఈ జీవోల వల్ల ఎలాంటి ఉపయోగం లేదని బాధితులు ఆవేదన చెందుతున్నారు. బాధితులను, ఉద్యోగ సంఘాలను సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం అన్యాయమని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జీవో రాగానే ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా ఉన్న మాజీ ఉపాధ్యాయ సంఘాల నాయకుడు తీవ్రంగా వ్యతిరేకించారు. 317 జీవోపై గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన కాంగ్రెస్ పార్టీ న్యాయం చేస్తుందని భావించిన ఉద్యోగులకు నిరాశే మిగిలింది.

> **కమిటీల పేర కాలయాపన ఎందుకో అర్థం కావడం లేదు. గతంలో ఉద్యోగులకు ప్రభుత్వానికి వారధిగా ఉన్న ఎమ్మెల్సీ కోదండరాంకు ఉద్యోగ సంఘాల నాయకులు ఎన్నో సార్లు సమస్యలు వివరించారు. అయినా ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదు. ఇప్పుడు కొత్తగా కేశవరావును నియమించి ఏడాది తర్వాత విషయం మొదటికి తెచ్చారు.**

ఇదిలా ఉంటే పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది. 31/3/24 నుంచి 7,346 ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. వీరికి ఏ ఒక్క బెనిఫిట్ ఇవ్వకుండా వేధిస్తున్నారని వారు ఆవేదన చెందుతున్నారు. అనేక ఆర్థిక ఇబ్బందులతో అనివార్యంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. 24 శాతం వడ్డీతో ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలని హైకోర్టు తీర్పు ఇచ్చినా అమలు కావడం లేదు. ఎన్‌క్యాష్మెంట్, గ్రాట్యుటీ, జీపీఎఫ్‌ల ద్వారా వచ్చే మొత్తం ఎప్పుడిస్తారో కూడా చెప్పడం లేదు. దాదాపు రూ.3,500 కోట్ల మేర చెల్లించాల్సిన ప్రభుత్వం నోరు విప్పడం లేదు. కొత్త ఆరోగ్య కార్డులు ఇచ్చి ఉద్యోగుల ఆరోగ్య సమస్యలు పరిష్కరిస్తామన్న కాంగ్రెస్ ఇప్పటివరకు ఈ విషయమై కనీసం సమీక్ష కూడా చేయలేదు. ఉద్యోగులు ప్రభుత్వానికి 500 నుంచి 1000 వరకు కాంట్రిబ్యూషన్ చెల్లిస్తామని చెప్పినా ఒక్కడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి వేస్తున్నది. ఏడాదిగా ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తుండటంతో ఉద్యోగుల పట్ల ప్రభుత్వ ప్రేమ ఉత్తదేనని తేలిపోతున్నది.

ఫీల్డ్ అసిస్టెంట్లకు, ఆశా వర్కర్లకు, ఇందిరా క్రాంతి పథకం, గ్రామీణ ఉపాధి హామీ, అంగన్వాడీ టీచర్లకు, ఇతర చిన్న తరగతి ఉద్యోగులకు తక్షణ వేతన హెచ్చింపు చేస్తామని చెప్పి కనీసం వేతనాలు కూడా రెగ్యులర్‌గా ఇవ్వకుండా ప్రభుత్వం వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నది. గ్రామ పంచాయతీ సిబ్బందికి ఇచ్చిన ఉద్యోగ భద్రత కనీస వేతన హామీ మరిచి పోయింది. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పి మోసం చేసింది. 1వ తేదీన వేతనం చెల్లిస్తున్నామని గొప్పగా ప్రకటిస్తున్నా కేవలం ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్ ద్వారా వేతనాలు పొందే వారికే చెల్లిస్తూ, లక్షకు పైగా ఉన్న ఉద్యోగులకు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం కాలయాపన చేస్తున్నది.

> **రెగ్యులర్ ఉద్యోగులకు వేతనాలు మాత్రమే ఇస్తూ ఎలాంటి ఇతర భత్యాలు, సరెండర్ లీవ్, రవాణా ఛార్జీలు, దిన భత్యం లాంటివి కూడా ఇవ్వడం లేదు. పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. పారిశుధ్య నిధులు విడుదల చేయకపోవడం వల్ల అప్పులు చేసి మరీ వారు పనులు చేయిస్తున్నారు. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.**

ఉద్యోగ సంఘాల నేతలను కలిసి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని, ఆర్థిక ప్రయోజనాల విషయంలో ఓపిక పట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభ్యర్థించారు. వచ్చే సంవత్సరం మే నెల తర్వాత ఉద్యోగ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి సబ్ కమిటీని వేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు ఇతర మంత్రులను కలిసి చర్చించాలని కోరారు. ఉద్యోగులు అడుగుతున్న కోరికలు కొత్తగా వచ్చినవి కావు. మ్యానిఫెస్టోలో చెప్పిన హామీలనే వాళ్లు గుర్తుచేస్తున్నారు. మళ్లీ కమిటీల పేర కాలయాపన ఎందుకో అర్థం కావడం లేదు. గతంలో ఉద్యోగులకు ప్రభుత్వానికి వారధిగా ఉన్న ఎమ్మెల్సీ కోదండరాంకు ఉద్యోగ సంఘాల నాయకులు ఎన్నో సార్లు సమస్యలు వివరించారు. అయినా ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదు. ఇప్పుడు కొత్తగా కేశవరావును నియమించి ఏడాది తర్వాత విషయం మొదటికి తెచ్చారు.

అన్నివర్గాల ప్రజలను వంచించినట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులనూ మోసం చేస్తున్నది. దీంతో కాంగ్రెస్‌కు ఓటు వేసిన ఉద్యోగుల ఆశలు అడియాసలు అయ్యాయి. కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీల గురించి ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేవిధంగా ఉద్యోగ సంఘాలు దృష్టిసారించాలి. అప్పుడే ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయి. మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీల గూర్చి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా కార్యాచరణ వైపు ఉద్యోగ సంఘాలు దృష్టి సారించాలి.

**(వ్యాసకర్త: ఉద్యోగ సంఘాల మాజీ నేత)**

*తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేండ్లకు కాంగ్రెస్ పార్టీ 'మార్పు' పేరిట ప్రజలను ఏమార్చి అధికారాన్ని చేజిక్కించుకున్నది. ఏడాది అయితే కానీ కాంగ్రెస్ పార్టీ తమను మోసం చేసిందనే విషయం ప్రజలకు తెలియలేదు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి అన్నీ విఫల ప్రయోగాలే. తెలంగాణ ఉద్యమంలో ఏనాడూ పాల్గొన్న చరిత్ర ఆయనకు లేకపోగా, ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన చరిత్ర తనది. ఇక పాలనా విషయానికి వస్తే కనీసం మంత్రిగా చేసిన అనుభవం కూడా లేదు. ఉద్యమంలో తెలంగాణ వ్యతిరేకులతో అంటకాగిన ఆయనకు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఏ మాత్రం తెలియవనేది నూటికి నూరుపాళ్లు నిజం. అందుకే, ఆయన సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే తెలంగాణ అస్తిత్వం ప్రమాదంలో పడ్డది. అందులో భాగమే తెలంగాణ అధికారిక చిహ్నంలో కాకతీయ తోరణాన్ని, చార్మినార్‌ను తొలగించే ప్రయత్నం చేయడం.*

# ప్రమాదంలో తెలంగాణ అస్తిత్వం



**శ్రీ శ్రీ కుమార్**
94403 54092



**2014** జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుంచి తొలి తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేసింది. బోనాలు, బతుకమ్మ వంటి తెలంగాణ పండుగలకు ప్రాముఖ్యం ఇచ్చింది. అంతేకాదు, తెలంగాణ వంటలు సైతం ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలంగాణ కట్టూ బొట్టు ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. హైదరాబాద్ అంటే మొదటగా గోల్కొండనే గుర్తుకువస్తుంది. అలాంటి గోల్కొండ కోట మీద భారతీయ త్రివర్ణ పతాకం జెండా రెపరెపలాడింది.

> **ఉద్యమ నాయకుడు కేసీఆర్ తెలంగాణ కోసం బయల్దేరితే ప్రజలు ఆయన వెన్నంటే నడిచారు. విధిలేక అన్ని రాజకీయ పార్టీలు 'జై తెలంగాణ' అని నినదించక తప్పనిసరి పరిస్థితి నెలకొన్నది. ఆ సమయంలోనే ఉద్యమకారులు, రాజకీయవేత్తలు, మేధావులు కలిసి 'తెలంగాణ తల్లి'ని రూపొందించారు.**

అయితే తెలంగాణ తల్లి తలపై కిరీటంతో పాటు ఒక చేతిలో మక్కజొన్న కంకి, మరో చేతిలో బతుకమ్మను ఏర్పాటుచేశారు. ఆ తల్లిని చూస్తే యువతలో రక్తం ఉరకలెత్తింది. ఆ తల్లి రూపం ఒక చైతన్య దీపికగా నాటి పోరాటానికి స్ఫూర్తిగా నిలిచింది. అలాంటి తెలంగాణ తల్లి రూపాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడం ప్రజలను ఏమార్చడమే. పైగా కొత్తగా రూపొందించిన తెలంగాణ తల్లి నుంచి తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక అయిన బతుకమ్మను వేరు చేయడం నిజంగా సిగ్గుచేటు.

ఏ వ్యక్తి అయినా తమ తల్లిని గొప్పగా చూడాలనే తపిస్తాడు కానీ, హీనంగా చూడాలని కోరుకోడు. తల్లి వైభవంగా కనిపిస్తే ఆ కుటుంబం సుభిక్షంగా వర్ధిల్లుతున్నట్టే లెక్క. అట్లా ఉన్న తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి తెలంగాణ అస్తిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాదంలో పడేసింది. నేటి తెలంగాణ తల్లి పట్టుచీరలో కాకుండా ముతకచీరలో ఉన్నది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన, తెలంగాణకు గర్వకారణమైన పోచంపల్లి, గద్వాల్ పట్టుచీరలు కట్టుకునే అర్హత మన తెలంగాణ తల్లికి లేదా? ఇది చేనేత పరిశ్రమలను, మన నేతన్నలను అవమానపరిచినట్టు కాదా? బతుకమ్మ లేని తెలంగాణ తల్లిని ప్రజలు ఆమోదించలేకపోతున్నారు. అంతేకాదు, 'జయ జయహే తెలంగాణ' పాటను ఒక ఆంధ్రా ప్రాంతానికి చెందిన సంగీత దర్శకుడితో, అది కూడా ఒక సినీ పాట తరహా రాష్ట్రగీతంగా ప్రకటించడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహించిన విజయోత్సవాలు చూసిన తర్వాత తెలంగాణ ఆనవాళ్లు క్రమంగా కనపడకుండా పోతాయేమోనన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి.

రాష్ట్రంలోని ప్రజలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే విజయోత్సవాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం సంబురాలు చేసుకోవడమే విడ్డూరం అంటే, వేదికలపై గాయకులతో సినిమా పాటలు పాడించటం ఆంధ్రప్రదేశ్‌లోని రికార్డు డ్యాన్స్ సంప్రదాయాలను చూసినట్టే ఉన్నది. అంతేకాదు, ఈ సంబురాలు తెలంగాణ సంస్కృతిని అవమానించినట్టుగా ఉన్నాయి. కాబట్టి తెలంగాణ సమాజం జాగ్రత్తమై కాంగ్రెస్ నేతల కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఉద్యమ సారథి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని వింత పోకడలకు పోతున్న సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ఆనవాళ్లను కనుమరుగు చేయడానికి ప్రయత్నిస్తున్నారనడంలో సందేహం లేదు. ఆయన పాలన తెలంగాణ అస్తిత్వానికే ప్రమాదం తెచ్చేలా ఉన్నది. తెలంగాణ ప్రజలు అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు మళ్లీ ఉద్యమ బాట పట్టాల్సిన అవసరం వస్తుందేమో. ■